అంతా వెళ్ళాక ఒంటిగా నిలబడిన లలిత భుజంమీదచెయ్యివేశాడు శంకరం. లలిత ఉలిక్కిపడి వెనక్కి వెళ్ళింది. శంకరం మరీదగ్గిరగా వెళ్లి నడుం చుట్టూ చెయ్యివేసి దగ్గిరగా తీసుకోబోయాడు. ఎర్రబడిన ముఖంతో కోపంగా ఒక పరుగున మేడమెట్లు యెక్కి పక్కమీద పడిపోయింది. చీకటిగా ఉన్న ఆ గదిలోకి వెళ్ళి తలుపువేశాడు. లలిత అతనివైపుచూసి భయంతో వణికిపోయింది. ఆ చీకటిలో అతని కళ్లు నిప్పుకణాల్లాగా మెరుస్తున్నాయి. శంకరం తనవైపే రావటం చూసి, లలిత గోడమూల ఒదిగి నిలబడింది, శంకరం మాటామంతీ లేకుండా లలితని తనవైపు గట్టిగా లాక్కున్నాడు.

ఇద్దరికీ జరిగిన ఘోరమైన పోట్లాటలో గదిలోని వస్తువులన్నీ చిందరవందర అయాయి. తల్లీ, తండ్రీ ఎంతపిలిచినాఇద్దరిలో ఒక్కరూపలకలేదు.

అర్థరాత్రి నిశబ్దంగా ఉన్న ఆ గది తలుపులు తెరచుకోవటం వెయ్యికళ్లతో కనిపెట్టుకునివున్న తల్లి చూసింది. రక్తమయమైన గుడ్డలతో శంకరం రావటం చూడగానే ఆమె కెవ్వుమని అరిచింది. రక్తపు మడుగులో పడివున్న లలితని చూడలేక శర్మ ఏడుస్తూ కళ్లు మూసుకున్నాడు.

అప్పటికీ ఇప్పటికీ ఆ ఇంట్లో మిగిలినవాళ్ళు ఏమయ్యారో తెలియదుగాని, ప్రతీ దీపావళికీ ఆ ఇంట్లో ఉన్నవాళ్లు మాత్రం భయపడిపోతారు.

తల విరబోసుకుని కాశ్మీరపు పట్టు చీరెతో పాలరాతి విగ్రహం తోటంతా తిరుగుతుందనీ గేటు వాకిట్లో నిలబడి అలా కదిలిపోతుందనీ అంటారు.

దీపావళి పండుగమాత్రం ఆ ఇంట్లో ఇప్పటికీ ఎవ్వరూ చేసుకోలేరు.

---

స్కెచ్

# "కైంకర్యస్వామి"

ఓగేటి శివరామకృష్ణ

కైలాసపట్టణ వాసులకు కైంకర్యస్వామి యిలవేల్పు. ముష్టిదాని దగ్గరనుంచి, కోటికిపడగలెత్తిన ధనవంతులవరకూ కైంకర్యస్వామియందు భక్తిశ్రద్ధలు కలిగియుంటారు. ఏవేవో మొక్కులను మొక్కుకుంటూ ఉంటారు కూడాను. అయితే కైంకర్య స్వామియందు వారికుండే భక్తిశ్రద్ధలు నానాటికి తమకోర్కెలు కొంచెం ఇంచుమించుగా నెరవేరుతూండటంవల్ల, అభివృద్ధి పొంగుతున్నాయిగాని సన్నగిల్లటంలేదు. ఇదంతా కేవలం ఆగ్రామవాసుల అదృష్టమేకాకుండా, ఆ దేవుడియొక్క అదృష్టమేమో కూడా.

కైంకర్యస్వామిని సేవించటం, ఉడతాభక్తితో కాయో కసురో దేవునికందించి తృప్తిపడటం, ఉత్తచేతులతోపోయి, ఒకకానీదక్షిణవేసి, అంతకు సగిపోయే ప్రసాదాన్నిపొందటం మరి ఆకానీయైనా ధర్మంచేయకుండా పోయి, ప్రసాదంకోసం రెండుమూడు మార్లు చేతులుచాచి, సరుకుమూట కట్టడం, ఆ పట్టణవాసుల్లో రకరకాల మనుష్యుల విద్యుక్త ధర్మం! ఈలాంటి భక్తులు వారంతా!

మరి అసలు విషయంలోకి వద్దాం. కైలాస పట్టణవాసుడు, నల్లబజారున అధికలాభములు గణించిన అపరదేశభక్తుడూ అయిన లంబోదర స్వామికి కైంకర్యస్వామిమీద హటాత్తుగా చెప్పలేని అనురాగం పుట్టుకొచ్చింది. లంబోదర స్వామికి శ్రీస్వామిమీద యెడతెగని అనురాగం పుట్టుకొచ్చినందుకు విజ్ఞులే వింతపడుతూంటే మన మేపాటివాళ్ళం? మీరే నిర్ణయించండి.

నల్లబజార్లో అధికలాభాలు యెంతోకాలం నుంచి పొందుతున్నా లంబోదరస్వామి మాత్రం యింతక్రితం అంతా తన ప్రయోజకత్వమే అన్నట్లుగా, యెవరయినా లంబోదరయ్య ప్రయోజకత్వాన్ని పొగడుతూ, ఆ భగవంతుని లీలలు వర్ణించుతూంటే, ఆయన మాత్రం కన్నెర్రచేసేవాడు! "అంతా తన స్వశక్తివల్లననీ, తనవల్లననీ" ఆయన ఒకప్పటి అభిప్రాయం. "ఆ, 'అదేంమాట. అదృష్టమంటూ ఉంటే మనల్ని దేవుడేంచేస్తాడు. బాగుపడితే అదృష్టమనుకోనాలి. దెబ్బతింటే కర్మ మనుకోవాలి" అనేవాడు.

లంబోదరస్వామితో కైలాసనగర వాసులందరికీ యేదో ఒక అవసరం ఉంటూనే ఉంటుంది. చివరకు రూపాయితొమ్మిదణాలు వడ్డీకి డబ్బు అప్పు పుచ్చుకొన్నా, ఆయన కనుసన్నల్లో మెలగటమే పట్టణవాసుల కనీసధర్మం అయింది. ఆయన అనే ప్రతీ మాటతో యేకీభవించని మహాత్ములున్నా, పాడిందే పాడరా అన్నట్లుగా ఆయన వెనకనే అవునన్నట్లుగా బుర్రలూపేరు.

ఈలాంటివాడు లంబోదరస్వామి! ఈలాంటి నాస్తికుడైన లంబోదరస్వామికి హఠాత్తుగా భగవంతునిమీద అనురాగం పుట్టుకొచ్చింది. అది కేవలం స్వామియొక్క అదృష్టవల్లనే నేమో! కాకపోతే - లంబోదస్వామంతటి ధనవంతుడు స్వామికి వేయి కొబ్బరికాయలు కొడతానని మ్రొక్కుకుంటాడా?

స్వామివారిమీద లంబోదరయ్యరు సహితం భక్తి కలిగినందుకు పట్టణవాసులంతా యెంతో సంతోషించారు. స్వామి లంబోదరస్వామి ధర్మాన నిత్యకళ్యాణంతో పచ్చ తోరణాంతో మరింత ప్రకాశించుతాడని వివేకులూహించారు. ఏమయినా-మరి మ్రొక్కు తీర్చడం యింకా జరపకపోయినా, లంబోదరస్వామి కొత్తగా నిర్మిస్తున్న ఆరంతస్థులమేడ పనిచేస్తున్న మనుష్యులతో "మీకేం భయం లేదురా! ఆ కైంకర్యస్వామిని నమ్ముకొండిరా! ఎలాగా మీ కోర్కెలు తప్పక సిద్ధించుతూంటాయి" అన్న ఫలితంగా వాళ్లు ఊహించారు. కైంకర్యస్వామి లంబోదరస్వామి కోర్కె తీర్చాడనీ, మరి ఆరంతస్థుల మేడ పూర్తవటంతోటే మ్రొక్కు తీరుస్తాడనీ.

మొత్తంమీద మేడ పూర్తయింది. లంబోదరస్వామిగారి మ్రొక్కుబడి సంగతి పట్టణవాసులందరికీ తెలిసిందేగా! సంభావన లుండకపోయినా వేయి కొబ్బరికాయలు కొట్టడం మూలకంగా, తమకు కనీసం ఒక చెక్కయినా, లభించక పోతుందా అనే ఉద్దేశంతో ప్రసాద భక్తులు చాలామంది దేవాలయం వద్దకు చేరారు.

వేయి కొబ్బరికాయలూ కొట్టడమయింది. తీర్థప్రసాదాలు లంబోదరస్వామి ప్రథమంలో పుచ్చుకొన్నాడు. తనప్రస్తుత ఇష్టదైవం "కైంకర్యస్వామిని" మనసారా మరో ఆరంతస్థుల మేడ కట్టేటట్లు అనుగ్రహించవలసిందని ప్రార్థించాడు.

పూజారి వినయంగా తనకు మామూలు ఇవ్వాలని అర్థించాడు. "మామూలు! మామూ లేమిటి? స్వామికి దక్షిణ యిచ్చానుగా అయిదు రూపాయలు" అన్నాడు లంబోదర స్వామి.

"అది స్వామివారిది. మరి మాకు?"

"ఇక్కడ కూడా బ్లాకుమార్కెటు లాంటిదే యేర్పడిందన్న మాట" అని నవ్వుతూ అన్నాడు లంబోదరస్వామి ఒకరూపాయి బిళ్లతీసి పూజారి చేతిలో పడేస్తూ.

నసుగుతూ పూజారి పుచ్చుకొన్నాడు:

కైంకర్యస్వామికి మరోనమస్కారం చేసి, పూజారివైపు చూసి...

"పంతులూ, మా బస్తాల్లో వేయి కొబ్బరి కాయలూ, జాగర్తగా వేయేం బాబూ"— అన్నాడు స్వామి.

"మీకు వేయి కొబ్బరి చెక్కలే వస్తాయ్"— అన్నాడు పూజారి.

"ఏం?"—ఆశ్చర్యంగా ప్రశ్నించాడు లంబోదరం!

"ఏం ఏమిటి... స్వామివారికి మరి కాయలో సగం!" అన్నాడు పూజారి.

"సరి...మంచిలాభసాటి వేపారమే! కైంకర్య స్వామికి వేయి కొబ్బరి చెక్కలు కైంకర్యమా!"—అని చిన్నబుచ్చుకు లంబోదర స్వామి బయటకు వెళ్ళబోతూంటే...

పూజారి వేయి చెక్కలు ఆయన అనుచరుల ముందు, లెక్కపెట్టి పడేశాడు; లంబోదరస్వామి వెనక్కు తిరిగాడు!

"మాకో చెక్క యివ్వండి; మాకో చెక్క యివ్వండి" అని ప్రసాద భక్తులు...అనుచరుల్ని పీక్కుతింటున్నారు.

లంబోదరస్వామి గుండె ఆగిపోయింది. గబగబ ముందుకువచ్చి: "వేయి చెక్కలు పోయి నేగోలెడుతూంటే యింకా ప్రసాదంయేమిటి... నడండి...వదిలంగా చెక్కలు తీసుకు... వేయి చెక్కలు కైంకర్యస్వామి కైంకర్యం చేసాడు! వాటినేంచేస్తాడో మరి...ఒక్క చెక్కముట్టుకోవడంలేదు. "కొబ్బరి నూనె ధర పెరిగింది... నూనాడించాలి!'' అన్నాడు!

ప్రసాదభక్తులు తెల్లబోయారు!

పూజారి నవ్వుకొన్నాడు!